# డ్రమ్‌సీడర్‌తో అధిక లాభాలు



పొలంలో డ్రమ్ సీడర్ లాగుతున్న రైతు

- **నీటి పొదుపు, తక్కువ ఖర్చు**
- **కూలీల సమస్యకు చెక్**

నేరేడుచర్ల, డిసెంబర్ 9 : డ్రమ్‌సీడర్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సాగుతో నీటితో పాటు, కూలీల సమస్యను అధిగమించవచ్చని చెబుతున్నారు. సరైన పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడి పొంది లాభాలు ఆర్జించవచ్చని సూచిస్తున్నారు. డ్రమ్‌సీడర్ ఉపయోగిస్తే సాలుకు సాలుకు మధ్య 20సెంటీ మీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 10సెంటీ మీటర్లు దూరం ఉండేట్లు విత్తుకోవాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల సాళ్ల మధ్య కలుపుతీసే యంత్రాన్ని నడిపి కలుపును భూమిలోకే కలియదున్ని మంచి ఫలితాన్ని పొందవచ్చు.

**పొలం తయారీ :** మొదట పొలంలో నీరు బాగా పెట్టి దున్ని నేలను చదును చేయాలి. విత్తనం విత్తే 24 గంటల ముందు పొలంలో నీరు తీసేసి నేలను చిక్కటి బురద పొరగా ఉండేలా చేసుకోవాలి. విత్తనం విత్తే ముందు పొలంలో కాగితం పొర మందం నీరు ఉండేలా చూసుకోవాలి. విత్తనాలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టాక 24గంటలు మండె కట్టాలి. విత్తనాల ముక్కులు పగిలి తెల్లగా మొలక కన్పించగానే విత్తుకోవాలి. తర్వాత మూడు రోజులకు ఒకసారి పొలంలో నీరు పెట్టి తీయాలి. ఈ పద్ధతిని 15 రోజుల పాటు పాటించాలి. ఆ తర్వాత మొలక ఎత్తను బట్టి నీరు పొలంలో తగిన మోతాదులో నిల్వ ఉంచుకోవాలి. ఈ పద్ధతిలో ఎకరానికి 12కిలోల విత్తనాలు సరిపోతాయి.

**యంత్రం ఉపయోగించే విధానం :** మొలకెత్తిన విత్తనాలను 2/3 వంతు డ్రమ్ములో నింపాలి. డ్రమ్ మూతను మూసివేసి లాక్ చేయాలి. డ్రమ్ సీడర్‌ను సాధారణంగా మనిషి నడిచే వేగంతో పొలంలో ఒక అంచు నుంచి సమానంగా లాగాలి. డ్రమ్‌సీడర్ రెండోగాడిని కొలమానంగా నిర్ణయించుకుని రెండోసారి డ్రమ్‌సీడర్ లాగేటప్పుడు మొదటి చక్రం డ్రమ్‌సీడర్ గాడిలో నడిపించాలి. తద్వారా సాళ్లు తేడా లేకుండా వస్తాయి. ఇలా పోవడం వల్ల సాలుకు సాలుకు మధ్య 20సెంటీ మీటర్లు ఎడం ఉంటుంది. డ్రమ్ సీడర్ రంధ్రాలతో వచ్చే విత్తనాలు సమానంగా పడుతున్నాయో లేదో అప్పుడప్పుడు పరిశీలించుకోవాలి. డ్రమ్ సీడర్‌లో విత్తన మోతాదు లెవల్ 1/4 వరకు వచ్చినప్పుడు తిరిగి విత్తనాలను నింపాలి.

**ప్రయోజనాలు :** కూలీల ఖర్చు ఉండదు విత్తనాలు సమానంగా విత్తితే మొక్కల సాంద్రత సమానంగా ఉంటుంది. విత్తన మోతాదు 50శాతం తగ్గుతుంది. పంట 10రోజుల ముందు పక్వతకు వస్తుంది. ఇద్దరు వ్యక్తులు రోజుకు రెండెకరాల్లో విత్తుకోవచ్చు. డ్రమ్‌సీడర్‌తో ఖర్చు తక్కువగా రావడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

# జిల్లాలో మరో ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోపే ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉన్నది. 2021 మార్చి 29 నుంచి ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2015 ఎన్నికల్లో తొలిసారిగా ఇక్కడి నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు. రెండోసారి కూడా బీఆర్‌ఎస్ నుంచి పల్లాకే అధినేత అవకాశం కల్పించారు. దీంతో 2021 మార్చి 14న జరిగిన పోలింగ్‌లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 2 సంవత్సరాల 9 నెలల పాటు శాసనమండలి సభ్యుడిగా ప్రాతినిథ్యం వహించారు. ఈ నెల 3న వెలువడిన ఫలితాల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో అనివార్యంగా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆదివారం తన రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేయడంతో ఆయన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రానున్న మూడు నాలుగు నెలల్లో మిగిలిన 3 సంవత్సరాల మూడు నెలల పదవీ కాలం కోసం ఉప ఎన్నిక జరుగనుంది. దీంతో నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల సందడి నెలకొననుంది.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సామాజిక కార్యకర్త గోపి

# ప్రకృతి వ్యవసాయంతో మేలు

**సామాజిక కార్యకర్త మొలుగూరి గోపి**

నడిగూడెం, డిసెంబర్ 9 : ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ సామాజిక కార్యకర్త మొలుగూరి గోపి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని చాకిరాల రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో రసాయన ఎరువులను వాడొద్దని కోరారు. అధిక రసాయన ఎరువులతో అనేక వ్యాధులు సంభవిస్తాయన్నారు. విత్తన శుద్ధి చేయాలంటే రసాయనాలకు బదులుగా బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తే వరి నారు ఆరోగ్యంగా దృఢంగా, బలంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

## మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

మఠంపల్లి, డిసెంబర్ 9 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు శనివారం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అబిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.



గడ్డిపల్లి కేవీకేలో మాట్లాడుతున్న కేవీకే హెడ్ నరేశ్

## గడ్డిపల్లి కేవీకేలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వీక్షణ

గరిడేపల్లి, డిసెంబర్ 9 : గిరిజనులు, ఆదివాసీల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, చర్యలను వివరించేందుకు చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బాగంగా ఢిల్లీలో ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాన్ని మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు శనివారం ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ సైంటిస్టు, హెడ్ దొంగరి నరేశ్ మాట్లాడుతూ నవంబర్ 15న ఆదివాసీ గౌరవ్ దివస్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ యాత్ర దేశ వ్యాప్తంగా 24 రాష్ట్రాల్లో 68జిల్లాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 8,500కు పైగా గ్రామ పంచాయతీల్లో పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీహెచ్.నరేశ్, ఎన్.సుగంధి, కార్యాలయ సిబ్బంది, గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రజలు అభివృద్ధికి సహకరించాలి : సుధాకర్‌నాయక్

మద్రిగూడ, డిసెంబర్ 9: గ్రామస్తులు అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ సుధాకర్‌నాయక్ కోరారు. శనివారం మండలంలోని ఖుదాభక్షిపల్లిలో గల 4వ వార్డులో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధాకర్‌నాయక్ మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంతో వీధులు పరిశుభ్రంగా మారుతాయని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైలారపు పార్వతమ్మాగిరేష్, వార్డు మెంబర్‌లు మహ్మద్ జావీద్, పల్లె మహేందర్, ఆంబోతు లక్ష్మణ్ నాయక్, కారింగ్ యాదమ్మ, వంగాల కొండల్ రెడ్డి, గండు యాదయ్య, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాదగోని శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుధాకర్‌నాయక్

## ఆలయాల్లో కార్తీక మాసం పూజలు

మేళ్లచెర్వు, డిసెంబర్ 9 : కార్తీక మాసం పురస్కరించుకొని మండలవ్యాప్తంగా ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని సంత సోమేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, హోమాలు, ఆకాశదీప ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. శివాలయం, వేంకటేశ్వర, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో అభిషేకాలు, ఆకాశదీప పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, యాతవాకిళ్ల భానుకిరణ్‌శర్మ, సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం, డిసెంబర్ 9 : మండల కేంద్రంలో ఈ నెల 15నుంచి చేపడుతున్న ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని లేబర్ ట్రైనింగ్ నిర్వాహకులు మేకల నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు శిక్షణకు వచ్చే వారు 18నుంచి 35ఏండ్లు వయస్సు ఉండాలని తెలిపారు. లేబర్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్ పొటోలు తీసుకుని రావాలని కోరారు. 30 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ 3 నెలల పాటు ఉంటుందని, శిక్షణ అనంతరం కొత్త మిషన్‌తో పాటు యూనిఫామ్, సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. వివరాలకు 90107 22563ను నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

మునుగోడు, డిసెంబర్9: మునుగోడు మండల శాఖ పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మునుగోడు మండల అధ్యక్షుడిగా గొడ్డటి నరసింహ, ప్రధాన కార్యదర్శిగా మిర్యాల మురళి, గౌరవ అధ్యక్షుడిగా కల్లూరి స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాశీరాం, ఆర్థిక కార్యదర్శిగా గడ్డం వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా పట్టేటి సైదులు, మహిళా కార్యదర్శులుగా జొన్నగల ధనలక్ష్మి, ఐతరాజు రేణుక, కార్యదర్శులుగా నరసింహ, నాంపల్లి విద్యాసాగర్, బోయపల్లి రవీందర్‌ను ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి, రాష్ట్ర నాయకులు యాదయ్యగౌడ్ వ్యవహరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |